క్లుప్తంగా

ఆర్డీఓ కొమురయ్య బాధ్యతల స్వీకరణ



కలెక్టర్ శరత్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఆర్డీఓ కొమురయ్య

నారాయణఖేడ్: నారాయణఖేడ్ రెవెన్యూ డివిజనల్ అధికారిగా (ఆర్డీఓ)గా డి.కొమురయ్య సోమవారం బాధ్యతలను స్వీకరించారు. మహబూబాబాద్ ఆర్డీఓగా పనిచేస్తున్న ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. తహశీల్, ఆర్డీఓ కార్యాలయ సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కొమురయ్య కలెక్టర్ శరత్‌ను కలిశారు.

వైకుంఠ రథం ప్రారంభం



వైకుంఠ రథాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే క్రాంతికిరణ్

వట్‌పల్లి(అందోల్): మండల పరిధిలోని కన్‌సాన్‌పల్లి గ్రామానికి చెందిన సోమన్నగారి ధీరజ్ రెడ్డి తన తల్లిదండ్రులు లక్ష్మమ్మ, మోహన్‌రెడ్డి జ్ఞాపకార్థం రూ.2.5లక్షలతో ఏర్పాటు చేసిన వైకుంఠ రథాన్ని సోమవారం ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపద సమయంలో అంతిమ సంస్కారాలు నిర్వహించేందుకు వైకుంఠ రథం ఏర్పాటుకు ముందుకువచ్చిన ధీరజ్ రెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ యాదాగౌడ్, ఎంపీటీసీ గజేందర్‌రెడ్డి, రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ జగన్మోహన్‌రెడ్డి, మాజీ డీసీసీబీ జిల్లా ఉపాధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లక్ష్మీకాంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నీటి సరఫరా బిల్లులు చెల్లించాలని నిలదీత



డీఈ సాబేర్‌ను నిలదీస్తున్న నీటిసరఫరా దారులు

జహీరాబాద్: వేసవిలో ఇంటింటికి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసిన బిల్లులను చెల్లించాలని నీటి సరఫరాదారులు కోరారు. ఈ మేరకు సోమవారం ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో డీఈ సాబేర్‌ను కలిసి బిల్లుల చెల్లింపుల్లో జరుగుతున్న జాప్యంపై నిలదీశారు. అనంతరం వారు మాట్లాడుతూ 2020 సంవత్సరంలో డివిజన్ పరిధిలోని జహీరాబాద్, కోహీర్, న్యాల్‌కల్, ఝరాసంగం, మొగుడంపల్లి, రాయికోడ్ మండలాల్లో అప్పట్లో తీవ్ర నీటి సమస్య ఉండడంతో ప్రభుత్వ పిలుపుమేరకు ముందుకు వచ్చి నీటిని సరఫరా చేశామని గుర్తు చేశారు. రూ.9కోట్ల మేర బిల్లులు రావాల్సి ఉందన్నారు. కరోనా కష్టకాలంలో తాము నీటిని సరఫరా చేసినా నేటికీ బిల్లులు చెల్లించడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి బిల్లులను చెల్లించాలని కోరారు.

ఎమ్మెల్యేపై ఆరోపణలు అవాస్తవం



మాట్లాడుతున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

జిన్నారం(పటాన్‌చెరు): ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డిపై బీజేపీ నాయకులు చేస్తున్న అవినీతి ఆరోపణలు అవాస్తవమని గుమ్మడిదల ఎంపీపీ ప్రవీణ, జెడ్పీటీసీ కుమార్‌గౌడ్ అన్నారు. సోమవారం గుమ్మడిదలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కానుకుంట–గుమ్మడిదల గ్రామాల మధ్య చేపడుతున్న రోడ్డు పనుల్లో అవినీతి జరిగిందని ఇటీవల బీజేపీ నాయకులు చేసిన ఆరోపణలు సరైనవి కావన్నారు. ఎమ్మెల్యే తన సొంత నిధులు రూ.9కోట్లు వెచ్చించి డబుల్ రోడ్డు పనులను చేయిస్తున్న విషయాన్ని గుర్తుంచుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో నాయకులు గోవర్ధన్‌రెడ్డి, సద్ది విజయభాస్కర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, హుస్సేన్, మురళి, నర్సింహరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా బోనాల ఉత్సవాలు

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని అన్నారం గ్రామంలో నిర్వహించిన బోనాల పండుగలో నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్, స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నిర్వాహకులు కాటాను శ్రీనివాస్‌గౌడ్ ఘనంగా సన్మానించారు. జిన్నారం ఎంపీపీ రవీందర్‌గౌడ్, నాయకులు వీరారెడ్డి, ప్రతాప్ రెడ్డి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

- కలెక్టర్ డాక్టర్ శరత్
- ప్రజావాణికి 68 అర్జీలు



అర్జీలను పరిశీలిస్తున్న కలెక్టర్ శరత్

సంగారెడ్డి టౌన్: ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహించొద్దని కలెక్టర్ డాక్టర్ శరత్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా అర్జీదార్ల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం కలెక్టర్ శరత్ మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా ప్రజావాణి నిర్వహిస్తున్నామన్నారు. ప్రజావాణికి 68 దరఖాస్తులు రాగా అందులో 29 రెవెన్యూ శాఖకు సంబంధించినవి, మిగిలినవి ల్యాండ్ సర్వే, పింఛన్లు, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు, దళితబంధు, బీసీల ఆర్థిక సాయం, కార్మికశాఖ, ఆర్టీసీ, విజిలెన్స్, ఇరిగేషన్, వ్యవసాయ, ఉపాధి కల్పన తదితర అంశాలపై అర్జీలు వచ్చినట్టు వివరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, డీఆర్ఓ నగేష్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చెరకు రైతుల పక్షాన పోరాడుతాం

- సమావేశంలో టీజేఎస్, కాంగ్రెస్ నేతలు



మాట్లాడుతున్న టీజేఎస్, కాంగ్రెస్ నాయకులు

జహీరాబాద్: చెరకు రైతుల పక్షాన పోరాడుతామని టీజేఎస్, కాంగ్రెస్ నాయకులు అన్నారు. ఈ మేరకు సోమవారం సీడీసీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టీజేఎస్ నియోజకవర్గం ఇన్‌చార్జి మొగుడంపల్లి ఆశప్ప, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహారెడ్డి, మాజీ కో–ఆప్షన్ సభ్యుడు అక్బర్ హుసేన్ మాట్లాడారు. కర్మాగారంలో క్రషింగ్‌ను నిర్వహించే విషయంలో అధికారులు, ప్రభుత్వం సానుకూలంగా స్పందించడంలేదని విమర్శించారు. చెరకు బకాయిలను ఇప్పించే విషయంలోనూ సానుకూలత కనిపించడం లేదన్నారు. దీంతో త్వరలోనే అఖిలపక్ష నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. చెరకు బిల్లులు, క్రషింగ్ విషయమై చర్చించేందుకు ప్రభుత్వం, బీఆర్ఎస్ నేతలు అఖిలపక్ష నేతలు, రైతులతో బహిరంగ సమావేశం ఏర్పాటు చేస్తే అందుకు తాము సిద్ధమేనని తెలిపారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు నరేష్, గోపాల్, మల్‌రెడ్డి, టీజేఎస్ నాయకులు రాజిరెడ్డి, గోపాల్‌రెడ్డి, నాగిరెడ్డి, మల్లికార్జున్, శ్రీనివాస్‌రెడ్డి, ప్రేమ్‌కుమార్ రైతులు పాల్గొన్నారు.

కాలుష్య జలాల పరిశీలన



నమూనాలను సేకరిస్తున్న అధికారులు

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని గడ్డపోతారం పారిశ్రామిక వాడలోని వివిధ పరిశ్రమల యాజమాన్యాలు కాలుష్య జలాలను వర్షం నీటితో కలిపి బయటకు వదిలేస్తుండటంతో ఈ కాలుష్య జలాలు సమీపంలోని అయ్యమ్మ చెరువులోకి చేరుతున్నాయి. దీంతో స్థానిక నాయకులు సోమవారం పీసీబీ అధికారులకు ఫిర్యాదు చేయగా పీసీబీ అధికారులు పారిశ్రామికవాడలో పర్యటించి కాలుష్య జలాల నమూనాలను సేకరించారు. కాలుష్య జలాలను వదులుతున్న పరిశ్రమలపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక నాయకులు, ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

నష్టపరిహారం చెక్కు అందజేత

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని బొబ్బిలిగామ గ్రామానికి చెందిన అశోక్‌గౌడ్ రెండేళ్ల క్రితం విద్యుదాఘాతంతో మృతి చెందాడు. దీంతో ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.5లక్షల నష్టపరిహారం చెక్కును రాష్ట్ర చేనేత సహకార అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్ సోమవారం మృతుడి భార్య సరితకు అందజేశారు. కార్యక్రమంలో ఏడీఈ వీరారెడ్డి, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు అమరేందర్‌రెడ్డి, సర్పంచ్ కుమార్, ఎంపీటీసీ సంతోష్‌గౌడ్, సొసైటీ చైర్మన్ రత్నాకర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

న్యాయమూర్తి శశిధర్‌రెడ్డికి సన్మానం

సంగారెడ్డి టౌన్: రంగారెడ్డి జిల్లా కోర్టుకు బదిలీపై వెళ్తున్న సంగారెడ్డి జిల్లా ప్రధాన న్యాయమూర్తి శశిధర్‌రెడ్డిని సోమవారం సంగారెడ్డి బార్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా సన్మానించి వీడ్కోలు తెలిపారు. ప్రస్తుతం శశిధర్ రెడ్డి స్థానంలో మొదటి అదనపు జిల్లా జడ్జి సుదర్శన్ ఇన్‌చార్జిగా ఉన్నారు.

ఎస్ఐ, సీఐకి సన్మానం



జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల ఎస్ఐగా విధులు నిర్వహించిన విజయకృష్ణ సీఐగా పదోన్నతి పొందారు. హత్నూర ఎస్ఐగా విధులు నిర్వహించిన లక్ష్మారెడ్డి గుమ్మడిదల ఎస్ఐగా బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డిని జెడ్పీటీసీ కుమార్‌గౌడ్, నాయకులు హుస్సేన్, గోవర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, యువజన సంఘాల నాయకులు ఎస్ఐ లక్ష్మారెడ్డికి స్వాగతం పలికి బదిలీపై వెళ్తున్న విజయకృష్ణకు వీడ్కోలు చెప్పారు.

ఘనంగా మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలు



పటాన్‌చెరు: పండ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



జహీరాబాద్ టౌన్: కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు



వట్‌పల్లి: కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే క్రాంతికిరణ్

జిల్లా వ్యాప్తంగా ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. పలుచోట్ల ప్రజాప్రతినిధులు రోగులకు పండ్లు, దుస్తులు పంపిణీ చేశారు.



సంగారెడ్డి మున్సిపాలిటీ: కేక్ కట్ చేస్తున్న చింతా ప్రభాకర్, నాయకులు

పట్టాపాసు పుస్తకాలు ఇవ్వాలి



డీఆర్వోకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కొండాపూర్(సంగారెడ్డి): మండలంలోని మునిదేవునిపల్లి గ్రామానికి చెందిన రైతులకు అసైన్డ్ భూములకు పట్టా పాస్‌పుస్తకాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో రైతులతో కలిసి డీఆర్వో నగేష్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామంలో సర్వే నెంబర్ 92, 154లో ప్రభుత్వం పట్టాలు ఇచ్చిన భూమిని కొన్నేళ్లుగా పేదలు సాగు చేసుకుంటున్నారన్నారు. కానీ.. వారికి ఇప్పటివరకూ కొత్త పట్టా పాస్‌పుస్తకాలను ఇవ్వలేదన్నారు. ప్రభుత్వం స్పందించి రైతులు పట్టాపాస్ పుస్తకాలు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు నర్సింహులు, రైతులు చంద్రయ్య, రాములు, రవి పాల్గొన్నారు.



కోహీర్‌లో కూలిన ఇల్లు



కవేలిలో కూలిన ఇల్లు

వర్షాలకు కూలిన ఇళ్లు

కోహీర్(జహీరాబాద్): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పట్టణంలోని జహంగీర్‌వాడకు చెందిన రహీం ఇల్లుతో పాటు కవేలి గ్రామానికి చెందిన పేతురు ఇల్లు కూలిపోవడంతో తీవ్ర నష్టం వాటిల్లింది. దీంతో ప్రభుత్వమే తమను ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

జీపీ కార్మికుల సమ్మెకు సంఘీభావం



సంఘీభావం తెలుపుతున్న నాయకులు

జహీరాబాద్ టౌన్: మొగుడంపల్లి మండల కేంద్రంలో సమ్మె చేస్తున్న పంచాయతీ కార్మికుల సమ్మెకు కాంగ్రెస్ మండల నాయకులు సోమవారం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులు 18 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ స్పందించి పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మక్సూద్, కోఆప్షన్ సభ్యుడు హర్షద్ జమపటేల్, నాయకులు రాంచందర్, వలిపాష, బాబురావు, మోహన్‌రెడ్డి, సిద్దారెడ్డి, చందర్ నాయక్, పవన్ నాయక్ పాల్గొన్నారు.

ఝరాసంగం(జహీరాబాద్): సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఎదుట చేపట్టిన పంచాయతీ ఉద్యోగ, కార్మికుల సమ్మె కొనసాగుతోంది. సమ్మెకు సీఐటీయూ మండల అధ్యక్షుడు చంద్రన్న మద్దతు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ ఉద్యోగులు, కార్మికుల పాల్గొన్నారు.

వేతన బకాయిలు చెల్లించాలి

- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు డిమాండ్

పటాన్‌చెరు టౌన్: మండలంలోని రుద్రారం, భానూర్, ఇంద్రేశంలో 3 నెలలుగా జీతాలు అందక కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని, జిన్నారం, అమీన్‌పూర్, గుమ్మడిదల మండలాల్లోనూ పెండింగ్‌లో ఉన్నాయని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల సమ్మె డిమాండ్ల సాధన కోసం ఈ నెల 27న చేపట్టిన చలో సంగారెడ్డి కలెక్టరేట్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక శ్రామికభవన్‌లో నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులు19 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వంలో చలనం లేదన్నారు. బిల్ కలెక్టర్, కారోబార్లకు కనీస వేతనం రూ.19,600, పారిశుధ్య వర్కర్లకు కనీస వేతనం రూ.16,600 చెల్లించాలని డిమాండ్ చేశారు. అర్హులైన వారిని జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా పదోన్నతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో భిక్షపతి, వేణు, జంగయ్య, శ్రీనివాస్, రాజు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్ణయంపై వీఆర్ఏల హర్షం



ఎమ్మెల్యే మాణిక్‌రావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వీఆర్ఏలు

జహీరాబాద్ టౌన్: వీఆర్ఏలను క్రమబద్ధీకరిస్తూ సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకొని జీవో విడుదల చేయడంతో సోమవారం ఎమ్మెల్యే మాణిక్‌రావును కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. విద్యార్హత ఆధారంగా తమకు గ్రేడ్‌లు కేటాయించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్టు వీఆర్ఏల సంఘం నాయకులు జైపాల్, ఎజాజ్, పాండు, బస్వరాజ్, సిద్దప్ప తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

జహీరాబాద్ టౌన్: సమస్యలను పరిష్కరించాలని సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం నాయకులు సోమవారం ఎమ్మెల్యే మాణిక్‌రావును కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ సమగ్ర శిక్షా ప్రాజెక్టులో భాగంగా డాటా ఎంట్రీ ఆపరేటర్లు, టెక్నికల్ పర్సన్‌లు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఐఈఆర్‌పీ మేనేజర్స్, స్కూల్ కాంప్లెక్స్, పాఠశాల స్థాయిలో పనిచేసే క్లస్టర్ రిసోర్స్ పర్సన్‌లు, పీటీఐలు కేజీబీవీ ఉపాధ్యాయులకు వేతనాలను పెంచాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు స్వరాజ్‌కుమార్, రాజు, ప్రశాంత్, సంగమేశ్వర్ పాల్గొన్నారు.

ఓనర్ కమ్ డ్రైవర్ స్కీం అమలు చేయండి



వినతి పత్రాన్ని అందజేస్తున్న గిరిజన నాయకులు

సంగారెడ్డి అర్బన్: ఓనర్ కమ్ డ్రైవర్ ఇంపవర్మెంట్ స్కీంను వెంటనే అమలు పరచాలని రాష్ట్ర గిరిజన ట్రైకర్ చైర్మన్ ఇస్లావత్ రామచందర్‌నాయక్, గిరిజన కో–ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ వల్యా నాయక్ సోమవారం ఉమ్మడి మెదక్ జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధ్యక్షుడు జైపాల్‌నాయక్ కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జైపాల్‌నాయక్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 2019–2020 సంవత్సరానికి గాను గిరిజన సంక్షేమ శాఖలో ఓనర్ కమ్ డ్రైవర్ ఎంపవర్మెంట్ స్కీమ్ కోసం దరఖాస్తు చేసినా ఇప్పటివరకు ఈ స్కీమ్ మంజూరు కాలేదన్నారు. ప్రభుత్వం స్పందించి ఓనర్ కమ్ డ్రైవర్ పథకం ద్వారా నిధులను మంజూరు చేయించాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ సంఘం జిల్లా నాయకులు రామచందర్‌నాయక్ రాథోడ్, గిరిజన విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పూల్‌సింగ్‌నాయక్, శంకర్ నాయక్, ప్రకాష్‌నాయక్, దినేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

చెరువు అభివృద్ధికి కృషి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పట్టణంలోని రాయసముద్రం చెరువు అభివృద్ధికి కృషి చేస్తానని కార్పొరేటర్ పుష్పనగేష్ తెలిపారు. సోమవారం రాయసముద్రం చెరువు వద్ద పిచ్చిమొక్కలను జీహెచ్‌ఎంసీ కార్మికులతో తొలగించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాయసముద్రం చెరువును పర్యాటక కేంద్రగా తీర్చిదిద్దుతామని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ ఎమ్మెల్యేకు సన్మానం

మునిపల్లి(అందోల్): మండల పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన ఆర్ఎంపీ వైద్యులు ఎండీ సుల్తాన్ ఆధ్వర్యంలో సోమవారం ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్‌కు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆర్ఎంపీ మండల సామాజిక వైద్య బృందం సభ్యులు పాల్గొన్నారు.

◆ కరాటేలో విద్యార్థుల ప్రతిభ

పటాన్‌చెరు టౌన్: మండల పరిధిలోని ముత్తంగి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఆదివారం పటాన్‌చెరు పట్టణంలోని జీహెచ్ఎంసీ హాల్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ద్వితీయ కరాటే ఛాంపియన్ షిప్ పోటీల్లో ప్రతిభ చాటారు. ఈ సందర్భంగా విద్యార్థులను సర్పంచ్ ఉపేందర్, హెచ్ఎం శారద, ఉపాధ్యాయులు అభినందించారు.

◆ దెబ్బతిన్న వంతెన పరిశీలన

రాయికోడ్(అందోల్): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని ధర్మాపూర్ శివారులో ప్రధాన రహదారిపై ఉన్న వంతెన పూర్తిగా దెబ్బతిన్నది. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి. ఈ క్రమంలో సోమవారం పంచాయతీ రాజ్ ఈఈ అంజయ్య, డీఈ కురుమయ్య, ఏఈ శశికుమార్ వంతెనను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని మరమ్మతు పనులు చేపట్టినట్టు తెలిపారు.

◆ బాధిత మహిళలకు నివాళి



నారాయణఖేడ్: ఇటీవల మణిపూర్‌లో హింసకు బలైన మహిళలకు నారాయణఖేడ్‌లో సోమవారం బీఎస్పీ ఆధ్వర్యంలో ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ ఖేడ్ నియోజకవర్గ ఇన్‌చార్జి మలిగదొడ్డి పండరి మాట్లాడుతూ మణిపూర్‌లో చోటుచేసుకున్న అమానవీయ ఘటనలకు ప్రధాని మోదీతో పాటు ఆ రాష్ట్ర సీఎం పూర్తిగా బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు శంకర్, ఆనంద్‌కుమార్, ప్రవీణ్, ప్రశాంత్, నర్సింహులు పాల్గొన్నారు.

◆ కావడి యాత్రకు సహకారం అందిస్తున్నాం

పటాన్‌చెరు టౌన్: కావడి యాత్రకు పూర్తి సహకారం అందిస్తున్నామని కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ అన్నారు. సోమవారం పటాన్‌చెరులోని చెరువు నీటిని ఒరిస్సా వాసులు తీసుకొని పాదయాత్రగా ఆల్విన్‌కాలనీలోని శివాలయానికి వెళ్లి శివలింగానికి పూజలు నిర్వహించారు. ఈ యాత్రకు కార్పొరేటర్ కుమార్ యాదవ్ (సౌండ్ సిస్టమ్‌ను), ఎమ్మెల్యే సోదరుడు మధుసూదన్‌రెడ్డి భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారికి ఒరిస్సా వాసులు కృతజ్ఞతలు తెలిపారు. బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అఫ్జల్ పాల్గొన్నారు.

◆ సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

వట్‌పల్లి(అందోల్): వీఆర్ఏలను క్రమబద్ధీకరిస్తూ జీవో జారీ చేయడంతో సోమవారం అందోల్, వట్‌పల్లి మండలాల్లోని వీఆర్ఏలు సీఎం కేసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో వీఆర్ఏ జేఏసీ రాష్ట్ర సెక్రటరీ బైండ్ల రమేశ్, సభ్యులు బాలయ్య, మహేశ్వరి, భిక్షపతి, లక్ష్మీ, యాదయ్య పాల్గొన్నారు.

◆ పాఠశాల తనిఖీ

కల్హేర్(నారాయణఖేడ్): మండల కేంద్రమైన సిర్గాపూర్‌లో ఉన్నత పాఠశాలను ఎంఈఓ శంకర్ సోమవారం తనిఖీ చేశారు. అనంతరం పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎంలు శివకుమార్‌స్వామి, వసంత్, సీఆర్‌పీ శివకుమార్ పాల్గొన్నారు.

◆ 15మందికి కోవిడ్ ర్యాపిడ్ టెస్టులు

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. సోమవారం 15 మందికి కోవిడ్ ర్యాపిడ్ ఆంటీజన్ టెస్టులు నిర్వహించగా అందులో అందరికీ నెగిటివ్ వచ్చిందని నిర్వాహకులు మనోహర్ తెలిపారు. అదేవిధంగా ఆర్టీపీసీఆర్ టెస్టులు 12మందికి నిర్వహించినట్లు పేర్కొన్నారు.

◆ ఓటరు నమోదుపై అవగాహన

నారాయణఖేడ్: నిజాంపేట్ మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం ఓటర్ల నమోదుపై బీఎల్‌వోలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మదన్ మాట్లాడుతూ అక్టోబర్ 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారిని ఓటర్లుగా నమోదు చేయించాలని సూచించారు. సర్పంచ్ జగదీశ్వరచారి, మాస్టర్ ట్రేనర్ నర్సింహులు, భూమయ్య పాల్గొన్నారు.

◆ విద్యార్థులకు వైద్య పరీక్షలు

జహీరాబాద్ టౌన్: మండలంలోని అల్గోల్ బాలుర మైనార్టీ గురుకుల పాఠశాలలో సోమవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందునా విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో మొగుడంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ పృథ్వీణి, సూపర్‌వైజర్ నాగరాజ్, గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ జమీల్, పాఠశాల ప్రిన్సిపాల్ రాములు, ఏఎన్ఎంలు లక్ష్మి, పద్మ, శ్యామల, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

◆ పింఛన్ పెంపుపై హర్షం

కంది(సంగారెడ్డి): దివ్యాంగులకు ఆసరా పింఛన్‌ను పెంచడాన్ని స్వాగతిస్తూ మండల పరిధిలోని లక్ష్మీనగర్‌లో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో దివ్యాంగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షురాలు జుబేదాబేగం, డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.